# థాంక్ మీ, మై సన్!

గజాననరావుకి ముచ్చెమట్లు పోసాయి. కొడుకు చందూ ఎడమచేత్తో తన మెడను చుట్టేసాడు. కుడిచేత్తో చాకు పట్టుకుని కంఠం మీద గీరుతున్నాడు. ఇలాటి పరిస్థితి వస్తుందని రావు ఎన్నడూ అనుకోలేదు. అసలు అరగంటక్రితం దాకా తన కొడుకునే చూడలేదతను. రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో పక్క ఇంటి తలుపు ఎవరో బాదుతూంటే నిద్రలో మెలకువ వచ్చింది.

"ఇంటినెంబరు 51 ఇదే కదా?" ఎవడో తాగుబోతు అరుస్తున్నాడు.

వాళ్లు తలుపు తీయకుండానే విసుక్కున్నారు. 'అర్ధరాత్రీ, అపరాత్రీ లేదు. వర్షం పడుతోంది. పైగా వెధవగోల.' అనుకుంటూ "ఎవరు?" అని కేక పెట్టారు.

"ఇంటినెంబరు 51 ఎక్కడ? అది చెప్పు?" అంటున్నాడు తాగుబోతు.

"పక్కిల్లే." అంటూ కిటికీ తలుపు దడాలున వేసుకున్న శబ్దం అయింది.

'51 అంటే తన ఇంటి నెంబరే. ఇంత రాత్రివేళ, ఈ వర్షంలో తన కోసం వచ్చినవాళ్లెవరయి ఉంటారబ్బా' అనుకుంటూ హాల్లోకి వెళ్లాడు రావు. తలుపు బాదడం మొదలవగానే కిటికీ తలుపు తెరిచి "ఎవరు?" అన్నాడు.

"గజాననరావు?" అడిగాడు తాగుబోతు కళ్లమీది నీళ్లు తుడుచుకుంటూ.

"అవును. నువ్వెవరు?"

"నేను చందూని, నీ కొడుకుని. హలో, తెలుసా? చందూని. యువర్ సన్., మై డాడ్" అన్నాడు వచ్చినతను తూలుతూ కిటికీ దగ్గరకొచ్చి.

ఆందోళన కప్పిపుచ్చుకుంటూ, "సరే, సరే. అరవక. ముందు లోపలికి రా." అంటూ తలుపు తెరిచాడు రావు.

ఇరవై ఏళ్ల యువకుడు. మట్టి కొట్టుకుపోయిన బట్టలు, పెరిగిన జుట్టు, గడ్డం, గుప్పుమని వాసన. బట్టలన్నీ తడిసి నీళ్లు కారుతున్నాయి. జీవితమంటే బేపర్వాగా ఉన్న ఆవారాలా ఉన్నాడు. రావు తలుపు తీయగానే లోపలికి వచ్చి హాలంతా కలయజూసాడు. చక్కగా అలంకరించి ఉంది. 'డబ్బు బాగానే ఉన్నట్టుంది ముసలాడికి, నైట్‌గౌనూ వ్యవహారం' అనుకున్నాడు. తూలుతూ వెళ్లి సోఫాలో కూచోబోయేడు.

గజాననరావు గాభరా పడ్డాడు. 'ఆగాగు, తువ్వాలు ఇస్తా' నంటూ లోపలికి వెళ్లి తువ్వాలుతో బాటు పైజమా, చొక్కా పట్టుకొచ్చాడు. అవి వేసుకుని, తలదువ్వుకొనేసరికి రావు పోలికలు అతనిలో కనబడ్డాయి. అతన్ని పలకరించి చూసిన రావుకీ అదే అనిపించింది. కానీ అతను వచ్చిన పద్ధతి తలచుకుని కోపం ముంచుకు వచ్చింది. "ఎందుకు వచ్చినట్టు?" అన్నాడు కటువుగా.

"నిన్ను చూడాలని.."

"చూడ్డానికి వచ్చే వేళా ఇది?"

"అమ్మతో పోట్లాట వచ్చింది. వరంగల్ నుంచి లారీ ఎక్కి వచ్చేసా."

"తాగి రావాలా?"

"లారీ డ్రైవరు తాగుతున్నాడు. నాకు ఆఫర్ చేసాడు."

"తాగొచ్చి ఇలాటి పాష్ ఏరియాలో గొడవ చేస్తే బాగుండదని అనిపించలేదా?"

"పక్కింటిలోనే లేపా. నిన్ను చూద్దామని.."

"సరేలే, కాస్త టీ కలిపిస్తాను. కూచో" అంటూ గజాననరావు కిచెన్‌లోకి వెళ్లాడు.

'ఒంటరిగానే ఉన్నాడు. మళ్లీ పెళ్లి చేసుకోలేదేమో' అనుకున్నాడు చందూ. టీపాయ్ పై ఉన్న మేగజైన్ తీసి రెండు పేజీలు తిప్పి పడేసాడు. కిచెన్‌లోకి వెళ్లాడు. పాలు మరిగిస్తున్నాడు తండ్రి. చందూ అలికిడి విని వెనక్కి తిరిగి చూసి, "చందూ, చందూ అని మీ అమ్మ ఉత్తరాలు రాస్తూ ఉంటుంది. నువ్వేనన్నమాట." అన్నాడు.

"అవును నేనే. నువ్వు మా అమ్మని వదిలేసి వెళ్లేటప్పటికి నాకు రెండేళ్లు. అందువల్ల నన్ను గుర్తుపట్టలేకపోవడంలో ఆశ్చర్యం లేదు."

"ఇవన్నీ ఎవరు చెప్పారు?"

"అమ్మే! నీ గురించి అన్నీ చెప్పింది. మీ షాపులో తనెలా చేరింది, ఎలా దగ్గరయిందీ, ఎలా పోట్లాడుకున్నదీ..."

"ఆడవాళ్లకి అన్నీ గుర్తే." అంటూ విదిలించి పారేసాడు రావు, టీ కప్పుల్లో పోస్తూ. ఒక కప్పు చందూకి అందిస్తూ, "చందూ" అని అతని పేరు ఉచ్చరిస్తూ, "నువ్వేం చేస్తూంటావు? చందూ" అని అడిగాడు 'నీకు పనీ, పాటా ఉండి ఉండదులే' అని ధ్వని జోడిస్తూ.

అతననుకున్నట్టుగానే చందూకి ఉద్యోగం, సద్యోగం లేదు. కానీ అతను దాని గురించి సిగ్గుపడటం లేదు. "ఈ రోజుల్లో ఉద్యోగాలెక్కడున్నాయి? పైగా నాలా చదువు, సంధ్య లేనివాడికి! ఈ పియమ్మార్వైలు అన్నీ బోగస్. వాళ్లక్కావల్సిన వాళ్లకే ఇచ్చుకుంటారు. నాలాటివాడు రోడ్లట్టుకు తిరగాల్సిందే."

"ఉన్న ఊళ్లోనే పని దొరకాలని కూచుంటే ఎలా?" అన్నాడు తండ్రి మందలించే ధోరణిలో.

"అదే నేనూ అనుకుంటున్నాను. అందుకే బొంబాయి వెళ్దామని ఇలా వచ్చాను." అని చందూ అంటే 'ఓహో' అని ఊరుకున్నాడు గజాననరావు.

సమాధానం ఇంత నిర్లిప్తంగా వస్తుందనుకోలేదు చందూ. 'ఎలాగో వచ్చావ్. ఓ నెల్లాళ్లుండి వెళ్లు' అని తండ్రి అంటాడేమోననుకున్నాడు. 'బొంబాయిలోనో, ఢిల్లీలోనో నాకు తెలిసున్నవాళ్లున్నారు. అడ్రసు ఇస్తాను. పట్టుకెళ్లు.' అంటాడనుకున్నాడు. ఏమీ లేకపోయినా 'ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మోసగించేవాళ్లుంటారు, భద్రం' అని జాగ్రత్తలు చెప్తాడనుకున్నాడు. ఏమీ లేదు. పట్టనట్టుగా ఉన్నాడు. ఆయనతో బాటు ఓ నెల్లాళ్లు ఒకే చూరుకింద ఉంటే సినిమాల్లో చూపించినట్టు ఇద్దరి మధ్యా ప్రేమాభిమానాలు పెరిగి కొడుకుగా పబ్లిగ్గా అంగీకరిస్తాడేమోనన్న ఆశ కూడా లేకపోలేదు చందూకి.

కొడుకు ముఖంలో నిరాశ చదివేడు గజాననరావు. మాట మార్చుద్దామని, "మీ అమ్మ ఎలా ఉంది?" అని అడిగాడు.

"బాగానే ఉంది. గడిచిపోతోంది. హాస్పటల్లో ఆయాలు సెలవుల్లో వెళితే తనని పిలుస్తుంటారు. తక్కిన రోజుల్లో మంత్రసానిగా వెళుతుంది. ఈ మధ్య సూపర్‌బజార్ వాళ్లు బియ్యం బాగు చేయడానికి పిలుస్తున్నారు, కమీషను మీద..."

"మీ అమ్మకు కోపం జాస్తిలే. ఎక్కడా ఉద్యోగం నిలుపుకోలేదు."

"నన్ను అనవసరంగా తిట్టింది ఇవాళ..."

".. నోరు కూడా ఎక్కువేలే."

"అందుకేనా నువ్వు అమ్మను వదిలేసావు?" అన్నాడు చందూ చటుక్కున. అన్నాక ఎందుకన్నానా అనుకున్నాడు. తనూ, తండ్రీ కలిసి కొన్ని చక్కటి అనుభవాలు, అనుభూతులు పంచుకున్నాక ఒక సాయంత్రం ఆయనను మాటల్లో దింపి, విషయం రాబట్టి, తల్లి మీద, తద్వారా తన మీద ప్రేమ తిరిగి మొలకెత్తేలా చేయాలనుకుని ప్లాను చేసుకున్నాడు. కానీ అనాలోచితంగా అదంతా భగ్నమయిపోయింది. కానీ గజాననరావుకి దీని గురించి చింతేమీ ఉన్నట్టులేదు.

"కట్టుకుంటే కదా వదిలేయడానికి?" అన్నాడు వంకరనవ్వు నవ్వుతూ. "పెళ్లి చేసుకుంటే కడుపులో

బిడ్డను పోషించాల్సిన భారం పడేది." అన్నాడు గారపట్టిన పళ్ళు ప్రదర్శిస్తూ.

"అంటే నన్నా?" అన్నాడు చందూ అయోమయంగా.

"నిన్నే. మీ అమ్మతో నేను కలిసి కాపురం చేసింది ఎన్నడూ లేదు. కోరిక పుట్టినప్పుడు షాపులోనే లోపల గదిలోకి పిలిచేవాణ్ని. లేదా ఒక్కోప్పుడు ఇంటికి వచ్చేవాణ్ని. అందించిన సుఖానికి అప్పుడప్పుడు డబ్బు ఇచ్చేవాణ్ని. అయినా తనకి వచ్చిన లోటేమీ లేదు. మీ తాతా, అమ్మమ్మ ఇల్లు తన పేరనే రాసారు."

"అదేమైనా రాజమహలా? పెంకుటిల్లేగా? అమ్మితే గట్టిగా పదివేలు కూడా రాలేదు." అన్నాడు చందూ చికాకుపడుతూ.

"తర్వాత ఏం చేసుకుందో మరి! అప్పుడయితే జరుగుబాటుకు లోటు లేకుండా ఉండేది." అన్నాడు గజాననరావు మొండిగా.

చందూ అతనికేసి చూసాడు. నిర్లక్ష్యానికి, స్వార్థానికి ప్రతిరూపంగా అనిపించాడు. అతనిచ్చిన టీ కూడా చేదుగా అనిపించింది. కప్పు కింద పెట్టేసి అసహ్యం ఉట్టిపడేలా ఓ చూపు విసిరేడు. కానీ అది గజాననరావు కంటపడలేదు. అతను సిగరెట్టు ముట్టించుకుంటున్నాడు.

"నువ్వొక్కడే ఉంటున్నావా? తోడెవరూ లేరా?" అని అడిగాడు చందూ.

"అంటే పెళ్లి చేసుకున్నావా, లేదా అడగడమా? పెళ్లీ, గిళ్లీ మన ఒంటికి పడవు. జుర్రుకోవడం, వదిలేయడం. నువ్వైనా అది చేయి. లేకపోతే ఎవరితో కడుపొచ్చినా నీ వల్లే నంటూ వెంటపడతారు." అన్నాడు గజాననరావు.

"ఈ వయస్సులో ఒంటరితనం బాధించదా?"

"కుక్క ఒకటి ఉండేది. ముసలిదై పోయింది. దానికి సేవలు చేస్తూ ఎక్కడ కూచోను? గరాజ్‌లోకి తరిమేసాను."

'హరినీ' అనుకున్నాడు చందూ. నువ్వూ ముసలాడివే, నీలాటి వాడు ఉంటేనేం, పోతేనేం అనుకున్నాడు. కాస్సేపాగి తనో సిగరెట్టు తీసుకుంటూ "అయితే నేను రెండేళ్ల వయస్సులో ఉండగా నువ్వు పారిపోయి వచ్చావన్నమాట." అన్నాడు.

"మీ అమ్మ అలా చెప్పిందా? పారిపోవడమేమిటి నాన్సెన్స్! నాకేం భయం? నాలుగురాళ్లు ఎక్కువగా సంపాదించే మార్గం ఈ ఊళ్లో కనబడింది. వచ్చేసాను. అయినా మీ అమ్మకు చెప్పాల్సిన పనేముంది? మా షాపులో పనిచేసేది. కౌంటర్లో బిజినెస్ పెంచింది. తనేమైనా పార్టనరా? నేను చెప్పి రావడానికి?"

"పార్టనర్‌గా భావించే కష్టపడి పనిచేసి బిజినెస్ పెంచింది. నువ్వు హఠాత్తుగా ఎవడికో అమ్మేసి వచ్చేస్తే తన గతేమిటి?"

"తన జాగ్రత్తలో తనుండాలి. తాగినప్పుడు, పక్కమీద చేరినప్పుడు లక్ష కబుర్లు చెప్తాం మురిపించడానికి. అవన్నీ నిజమని ఎవడనుకోమన్నాడు?"

"అందుకే ముందు ఉద్యోగం పీకేసి, తర్వాత పారిపోయేవు."

"లేకపోతే పెద్ద సీను క్రియేట్ చేయాలా? అప్పటికీ నా అడ్రసు కనుక్కొని ఉత్తరాలు రాసినప్పుడు అడపాదడపా డబ్బు పంపిస్తూనే ఉన్నాను."

"పంటికిందకు రాదది."

"రూపాయలు చెట్లకు కాయడం లేదు."

"ఇక్కడ హంగామా చూస్తూ ఉంటే కాస్తున్నట్లే ఉంది." అన్నాడు చందూ హాల్లో సోఫా సీటును తడుతూ.

"చూడు చందూ, డబ్బు ఎక్కువగా పంపిస్తే నువ్వు నాకు పుట్టిన వాడివని ఒప్పుకున్నట్టే అవుతుంది."

"నీకు పుట్టినవాడినేగా."

"పెద్దవాడివయ్యాక ఇప్పుడు నా పోలికలు స్పష్టంగా కనబడుతున్నాయి కనక కాదనడం కష్టం."



"ఇంకేం మరి?"

గజాననరావు చిరునవ్వు నవ్వాడు. "చూడు బాబూ, నీకో ఉచిత సలహా ఇస్తున్నాను. విను. నువ్వు మెతగ్గా ఉంటే జనాలు అదనీ ఇదనీ చెప్పి చంపుకు తింటారు. అందువల్ల నీ తప్పును ఎప్పటికీ ఒప్పుకోకు. ఇదీ నా ఫిలాసఫీ. అందువల్ల నిన్ను కొడుగ్గా స్వీకరిస్తానని కలలో కూడా అనుకోకు."

చందూ ఛట్టున లేచాడు. గజాననరావు వెనుకగా వచ్చి మెడ చుట్టూ చేయి బిగించాడు. "నేను నిన్ను చంపుకు తినను. చంపి వెళ్లిపోతాను." అన్నాడు కుడిచేయి టీ పాయి పైకి పోనిస్తూ.

గజాననరావు హుందాతనం ఎగిరిపోయింది. "ఎందుకు చంపడం?" అన్నాడు గాభరాగా.

"నువ్వు నరరూప రాక్షసుడివి కనక. స్వార్థపరుడివి కనక. చచ్చినా నష్టం లేదు కనక." అంటూ టీపాయ్ పైనున్న పళ్లు కోసుకునే చాకు పైకెత్తి పీకమీద పెట్టాడు చందూ.

గజాననరావు తన ఆలోచనల్లో తాను ఉండగా చందూ పట్టు ఇంకా బిగిసింది. తాగి ఉన్నాడు. తిక్కరేగి ఉన్నాడు. ఏ అఘాయిత్యానికైనా వెరవనట్టుగా ఉన్నాడు. ఇప్పుడేం చేయాలో తెలియలేదు గజాననరావుకి. "నేను నీకేమీ ద్రోహం చేయలేదే" అన్నాడు నోరు పెగల్చుకుని.

"తండ్రి చేయాల్సింది ఉపకారం. ద్రోహం చేయకుండా ఉండడం కాదు. కొడుకుని మంచిమార్గంలో పెట్టి వాడికి మంచి బతుకుని ఇవ్వడం తండ్రి బాధ్యత. ముందు అది తెలుసుకో." అన్నాడు చందూ, తన పట్టు బిగిస్తూ.

గజాననరావు మాట్లాడలేకపోయాడు. "పోనీ నేను చెడ్డవాణ్నే అనుకో. కానీ నీ భవిష్యత్తు గురించి ఆలోచించి చూడు. నన్ను చంపితే నువ్వు అరెస్టు అవుతానన్న విషయం నీకు తట్టటం లేదా?" అన్నాడు

చివరికి.

"నిన్ను ఇక్కడ చంపేసి, చడీ చప్పుడు లేకుండా వెళ్లిపోతాను. నీ శవం ఇక్కడే కుళ్లిపోతుంది. వాసన వచ్చేవరకూ ఎవరికీ తెలియదు. అప్పుడు తలుపులు తీసి నిన్ను చూసినా ఎవడు మాత్రం ఏం చేయగలరు? నేను వచ్చిన సంగతి ఎవరికి తెలుస్తుంది కనక? నువ్వు ఎంతమంది ఆడవాళ్లను ఇలా అన్యాయం చేసావో, ఎవరికి మంట పుట్టి నిన్ను చంపారో! నీలాటి వాడు బిజినెస్ కూడా చాలా అక్రమాలు చేసేవుంటాడు. ఎవడో ఒకడు కసి తీర్చుకుని ఉంటాడు అనుకుంటారు పోలీసులు. ఎంతమందినని అనుమానిస్తారు? కేసు మూసిపారేస్తారు."

"నిన్ను ఎవరూ అనుమానించరని అంత గట్టి నమ్మకం ఎందుకు? నువ్వు పక్కింట్లోనే నా గురించి అడిగేవు. వాళ్లు సాక్ష్యం చెప్తారు."

"పోలీసులు వచ్చి అడిగితే పక్క వీధి అనుకుని ఈ వీధికి వచ్చానని చెబుతాను. అయినా ఇంతరాత్రి, వర్షంలో... కిటికీ తలుపు కొద్దిగా తెరిచి సమాధానం చెప్పిన వాళ్లకి నా మొహం గుర్తుండే అవకాశమే లేదు."

గజాననరావుకి భయం వేసింది. తనను చంపడానికి చందూ ఏ మాత్రం సంకోచించడని అర్థమయిపోయింది. నిట్టూర్చాడు. నిట్టూర్చి "జీవితమంతా ఏ దిగులూ లేకుండా బతికాను. ఇప్పుడు కూడా దిగులు లేదు. నన్ను చంపినవాడి మీద ప్రతీకారం తీర్చుకోకుండా పోవడం లేదు." అన్నాడు.

చందూకి అర్థం కాలేదు. "అంటే?"

"నిన్ను పట్టించే సాక్ష్యం ఏదీ లేదని అనుకుని నన్ను చంపుతున్నావు. కానీ నా విల్లు సంగతి మర్చిపోయావు. అది చూడగానే పోలీసులకు అతి సులభంగా మోటివ్ దొరుకుతుంది."

"విల్లులో ఏముంది?"

"నా యావదాస్తి నీ పేర ఉంది. నేను ఎంతకాలమైనా ఆరోగ్యంగా చచ్చే సూచనలు కనబడటం లేదు. నువ్వు నిరుద్యోగంతో విసిగి, వేసారి ఉన్నావు. నేను ఛస్తే కానీ నా ఆస్తి నీకు దక్కదు. అందువల్ల దొంగతనంగా వచ్చి నన్ను చంపి పారేసావు. - అది పోలీసులు ఊహించే మోటివ్. ఆ లైన్లో పరిశోధన చేస్తే నువ్వు దొరక్కపోవు, నా ఆత్మకు శాంతి లభించకపోదు."

చందూ కత్తి అప్రయత్నంగానే కిందకు దిగింది. "నువ్వు అబద్ధాలు చెప్తున్నావు. బతికున్నంత కాలం నన్ను పట్టించుకోని వాడివి చచ్చాక ఆస్తి ఇస్తావా?" అన్నాడు.

"ఇందులో ఆశ్చర్యం ఏముంది? బతికున్నంత కాలం అనుభవిద్దామనే నా కోరిక. నేను చచ్చాక ఆస్తి ఎలా పోతే నాకేం? అనాథాశ్రమాలకు రాసిచ్చి సోమర్లను తయారుచేయడం నా కిష్టం లేదు. ఇంత దర్జాగా బతికాక నేను మిగిల్చే ఆస్తి ఎంతో నాకూ తెలియదు. ఖర్చయి పోగా మిగిలినది ఎవడి కిద్దామన్న ఆలోచన వచ్చినప్పుడు నీ పేరే తట్టింది నాకు. నేను తిరిగిన మిగతా ఆడవాళ్లకు పిల్లలు పుట్టారో లేదో నాకు తెలియదు. పుట్టినా వాళ్ల తల్లులెవరూ నాకు మీ అమ్మ లాగ ఉత్తరాలు రాయలేదు. అందువల్ల వాళ్ల పేర్లూ తెలియవు. మీ అమ్మ ఉత్తరాల ధర్మమాని నీ పేరు, అడ్రసు తెలుసు. పోనీ కదాని నా తదనంతరం నీ పేర రాసి పడేసాను. ప్రేమ కొద్దీ రాయలేదు కానీ ఇప్పుడు నా హంతకుడిమీద కసి తీర్చుకోడానికి పనిచేస్తోంది అది. అదీ తమాషా!"

చందూకి విషయమంతా అర్థమయింది. అనుకోకుండా తండ్రి చేసిన ఉపకారం తన మెడకు చుట్టుకుంది. "ఛీ" అనుకుంటూ, కత్తి విసిరేసి, విసురుగా బయటకు నడిచేడు.

అతను బయటకు నడవగానే గజాననరావు గబుక్కున తలుపు మూసేసి గడియ వేసేసాడు. కిటికీ తలుపు తీసి కొడుకుని పిలిచి చెప్పాడు. "చూడు చందూ, తండ్రి చేయాల్సింది కొడుకుని మంచి మార్గంలో పెట్టడం అన్నావు కదూ. ఇవాళ నేను చేసినది అదే. నా కొడుకు హంతకుడు కాకుండా కాపాడేను... అబద్ధం చెప్పడానికి కూడా వెరవకుండా. థాంక్ మీ, మై సన్! గుడ్‌బై!"